# ప్రజా వేదికకు అర్జీల వెల్లువ



- అర్జీలు స్వీకరించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కొల్లు రవీంద్ర, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

**అమరావతి,ఆంధ్రప్రభ:** ప్రజా వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. బుధ వారం టీడీపీ కేంద్ర కార్యాలయం లో నిర్వహించిన ప్రజా వేదికలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కొల్లు రవీంద్ర, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అర్జీలు స్వీకరించారు. ఎమ్మార్వో, వీఆర్వో తమ పేరుమీద ఉన్న భూమిని అక్రమం గా మరొకరి పేరిట మార్చారని దీనిపై ఉన్నతాధి కారులు విచారించి తమ భూమి తమకు దక్కేలా చూడాలని చిత్తూరు జిల్లా సదుం మండలం కంభంవారిపల్లె గ్రామానికి చెందిన బండి మంజుల విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేట గ్రామానికి చెందిన సయ్యద్ బాషా, తన తాతగారి ఆస్తిని వైసీపీ మాజీ సర్పంచ్ సులేమాన్ సాహెబ్ కబ్జా చేశాడని, అతని కబ్జా నుండి తమ స్థలాన్ని విడిపించి తమకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం నుండి పుల్లల చెరువు వరకు ఉన్న రహదారి చిన్నది కావ డంతో వాహనదారులు ఇబ్బం దులు పడుతున్నార నిదాన్ని డబుల్ రోడ్డుగా మార్చి వాహన దారుల సమస్యలు పరిష్క రించాలని తూమాటి అచ్చయ్య విజ్ఞప్తి చేశారు. అలాగే యర్ర గొండపాలెం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు దృష్టి పెట్టి గ్రామాల్లోని తాగు నీటి సమస్య ను పరిష్కరించాలని కోరారు.గుంటూరు జిల్లా తాడికొండ మండలం గరికపాడు గ్రామానికి చెందిన బండ్లమూడి సుజని విజ్ఞప్తి చేస్తూ, తనకు తన నానమ్మ ద్వారా వారస త్వంగా వచ్చిన భూమిని తనకు ఆన్‌లైన్ చేయకుండా మరొక రికి ఆన్ లైన్ చేశారని జరిగిన తప్పును సరిచేసి తమ భూమి తమ పేరుమీద ఆన్ లైన్ చేయాలని నేతలకు వేడుకున్నారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం విన్నకోట గ్రామానికి చెందిన ఉప్పలపాటి వెంకటకృష్ణారావు తాను ఎన్ని సార్లు అధికారులకు అర్జీలు పెట్టినా తమ భూమిని సర్వే చేసి హద్దు లు చూపడంలేదని,అధికారుల నిర్లక్ష్యంతో చెరువును ఎండ గట్టాల్సిన పరిస్తితి ఏర్పడిందని, దాంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని నేతల దృష్టికి తీసుకు వచ్చారు.వెంటనే సర్వే చేసి ఎవరి భూములు వారికి హద్దులు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో తమ పేర్లను తొలగించి తమ భూములను అధికా రులు వేరొకరి పేరిట మార్చారని, ఈ అవకతవకలపై విచార ణ జరిపి తమ భూమి తమకు దక్కేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన సి. శ్రీకాంత్ విజ్ఞప్తి చేశాడు. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన బొగ్గు శ్రీనివాసరెడ్డి గ్రీవెన్స్ లో గత ప్రభుత్వంలో సుమారు 44 ఇళ్లను 40 ఇళ్ల స్థలాలను అక్రమంగా అర్హులకు కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నేతలకు అర్జీ ద్వారా ఫిర్యాదు చేశారు.

# గిరిజన హక్కులు కాపాడడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

*ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు..*

**అమరావతి,ఆంధ్రప్రభ:** గిరిజన హక్కులు కాపాడడా నికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధి కూటమి ప్రభు త్వంతోనే సాధ్యమన్నారు.1/70 చట్టం గురించి ఆదివాసీలు అపోహలు పెట్టుకోవద్దు, జీఓ-3 ని అమలు చేసేందుకు కూట మి ప్రభుత్వం కట్టుబడి ఉంది అని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమం, వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఎన్టీఆర్ 1985లో జీఓ 275 ఇచ్చి గిరిజను లకు హక్కులు కల్పించి వాటి సంరక్షణకు కృషి చేసిందని, ఆయన ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు 2000 సంవత్సరంలోనే జీవో-3ను తెచ్చి వారిలో మనో ధైర్యాన్ని నింపారన్నారు. వైసీపీ ప్రభుత్వం జీవో -3ను రద్దు చేస్తే కనీ సం రివ్యూ పిటిషన్ కూడా వేయకపోవడం శోచనీయ మన్నారు. వైసీపీ ప్రభుత్వానికి గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బొరగం శ్రీనివాస్ మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఆదివాసీలను అన్ని విధాలుగా అణగదొక్కాలని చూసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలం దరికీ మౌలిక సదుపాయాలు, రోడ్లు, వంతెనలు ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఐటీడీఏలను వైసీపీ జేబు సంస్థల్లా వాడుకుని అవినీతికి అడ్డగా మార్చారని దుయ్యబట్టారు.

# గుంటూరు జిల్లా కోర్టుకు రఘురామరాజు



**గుంటూరు క్రైం, ఆంధ్రప్రభ:** కస్టోడియల్ టార్చర్ కేసులో న్యాయమూర్తి ఎదుట 164 స్టేట్మెంట్ ఇచ్చేందుకు ఏపీ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు బుధవారం గుంటూరు జిల్లా కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ, న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయని కామేపల్లి తులసిబాబును సీఐడీ కేసుల్లో లీగల్ అసిస్టెంట్‌గా నియమించి రూ.48లక్షలు చెల్లించడంపై విచారణ కోసం ఏసీబీకి లేఖ రాయనున్నట్టు రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న తులసిబాబును 2020 అక్టోబరు 6న లీగల్ అసిస్టెంట్‌గా నియమించారని, వాస్తవానికి తులసిబాబు 2021 అక్టోబర్‌లో ఏపీ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారని, ఎన్రోల్ అయిన మూడు నెలల్లోనే 12 కేసుల్లో సహకరించినందుకు తులసి బాబుకు సీఐడీ రూ.48 లక్షల ఫీజు చెల్లించిందని పేర్కొన్నారు. ఇది తులసిబాబుకు, సీఐడీ మాజీ ఛీఫ్ సునీల్ కుమార్‌కు మధ్య సాన్నిహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. హైకోర్టులోని 12 సీఐడీ కేసుల ట్రయల్ కోసం నియమిస్తున్నట్లు పేర్కొన్నారని, వాస్తవానికి సీఐడీ క్రిమినల్ కేసుల విషయంలో హైకోర్టులో ట్రయల్ ఉండదన్నారు. హైకోర్టులో సీఐడీ కేసుల ట్రయల్ కోసం ప్రభుత్వం నుంచి రూ. కోటి తీసుకొని అవినీతి కి పాల్పడ్డా రన్న రఘురామ.. దీనిపై విచారణ జరపాలని ఏసీబీని లేఖ ద్వారా కోరనున్నట్లు తెలిపారు. ఐపీఎస్ సునీల్ కుమార్ ను సస్పెండ్ చేయకుండా విచారణ ఎలా చేస్తారని, ఐపీఎస్ అధికారిగా ఉంటూ స్వచ్ఛంద సంస్థను సునీల్‌కుమార్ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. జగన్ అసెంబ్లీకి రావాలని కోరుతున్నానని, జగన్ 2.0 వ్యాఖ్యలు ఆయన ఉనికి కోసమే అని ఎద్దేవా చేశారు.

**విశ్రాంత ఏఎస్పీ విజయ్‌పాల్‌కు బెయిల్...**

కస్టోడియల్ టార్చర్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న విశ్రాంత సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను గుంటూరు 2వ అదనపు కోర్టు మంజూరు చేసింది.

# ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు ఏర్పాటు చేశారు?

- అనధికార ఏర్పాటుపై అధికారుల విచారణ
- ఇష్టారీతిలో 300 ట్రాన్స్‌ఫార్మర్లు బిగింపు
- ఇప్పటికే పలువురిపై కేసు, విజిలెన్స్ విచారణ పూర్తి

**అమరావతి,ఆంధ్రప్రభ:** కర్నూలు జిల్లాలో అనధికారి కంగా ఏర్పాటుచేసిన 300 ట్రాన్స్‌ఫార్మర్ల విషయమై బుధ వారం విచారణ ప్రారంభమైంది. కర్నూలు జిల్లా డోన్ డివిజన్ క్రిష్ణగిరి మండలంలో హై వోల్టేజీ డిస్ట్రిబ్యూషన్ స్కీమ్ కింద 2018లో అప్పటి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసింది. హెచ్‌వీడీఎస్ కింద 11 కేవీ లైన్లను ఒకటి లేదా రెండు పంపుసెట్ల క్లస్టర్ వరకు నడపడం, 25 కేవీ సామర్థ్యం గల 3, 4 స్టార్ రేటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఉపయోగించడం, ఎల్.టి. లైన్లతో ఒకటి లేదా రెండు ఐపీ సెట్‌లకు సరఫరా చేసే ముఖ్య ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేశారు. అయితే ఈ స్కీమ్ కింద డోన్ డివిజన్ లోని క్రిష్ణగిరి, చిట్యాల, కంబలపాడు, పెనుమాడ, కోయిలకొండ, బాపనదొడ్డి గ్రామాల్లో 300 వరకు ట్రాన్స్ పార్మర్లను అనధికారికంగా ఏర్పాటుచేశారు. ఈ బాగోతం అప్పట్లో ప్రకంపనలు సృష్టించింది. రూ.10 కోట్ల మేర చేతులు మారినట్లు విజిలెన్స్ విచారణలో కూడా వెల్లడైనట్లు తెలిసింది. కాగా బుధవారం విద్యుత్ ఎంక్వయిరీ విభాగం ఎస్ఈ కృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. అనధికార ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసిన కంబలపాడు ఎర్రగుడి, ప్రాంతా లలో విచారణ అధికారులు పర్యటించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ప్రాంతాల్లోనే ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేశారా? లేదా ఇష్టారీతిన అమర్చారా తదితర విషయాలను అధికారులు వారిని అడిగి తెలుసుకు న్నారు. అనంతరం డోన్ డివిజన్ కార్యాలయంలోని ఉద్యోగులను సైతం విచారించారు. తిరిగి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డోన్ డివిజన్ కార్యాల యంలో ఉద్యోగులను విచారించారు. విచారణ నిష్పక్షపా తంగా జరగడం లేదని ఇంజనీరింగ్ అధికారులకు మేలు జరిగేటట్లు వ్యవహరిస్తున్నారన్న యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఈపీసీపీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు సైతం షిర్డీ సాయి కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తు న్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎండి సంతోష్ రావు కూడా నేరం చేసిన వారికి ముఖ్యంగా షిరిడి వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే విజిలెన్స్ విచారణ పూర్తికాగా, బుధవారం డిపార్ట్‌మెంట్ దర్యాప్తు కూడా పూర్తయింది. ఈ నివేదికల ప్రకారం అసలు ఈ వ్యవహారంలో అవినీతికి పాల్పడిన అధికారులను ఏం చేస్తారో వేచిచూడాల్సిందే.

# జేఈఈ మెయిన్స్‌లో గురుకులాల విద్యార్థుల ప్రతిభ

**అమరావతి, ఆంధ్రప్రభ:** జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైల్‌తో జేఈఈ అడ్వాన్స్‌కి అర్హత సాధించిన డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అభినంధనలు తెలిపారు. కర్నూలు జిల్లా చిన్న టేకూరు, ఎన్టీఆర్ జిల్లా ఈడుపుగల్లు, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేకంగా జేఈఈకి ఉచితంగా శిక్షణ అందజేసింది. ఈ మూడు పాఠశాల్లలో 190 మంది విద్యార్థులు శిక్షణ పొందగా అందులో 110 మంది అడ్వాన్స్‌కి అర్హత సాధించారు. 11 మంది విద్యార్థులు 90కి పైగా పర్సం టైల్ సాధించారు. చినటేకూరు గురుకుల విద్యార్థి అడపాక నవీన్ 97.61 శాతం పర్సంటైల్ సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... కష్టపడి చదివిన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన అధ్యాపక సిబ్బందికి అభినందనలు తెలిపారు. వీరి స్ఫూర్తితో వచ్చే ఏడాది మరింత మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో పర్సంటైల్ సాధించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యాబోధన అందిస్తున్నామన్నారు.

# హైస్కూల్ ప్లస్‌లపై నీలినీడలు



- గతంలో రాష్ట్రవ్యాప్తంగా 502 హైస్కూల్ ప్లస్‌లు ఏర్పాటు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి జూ. కళాశాలలుగా మార్చాలని యోచన
- యధాతథంగా కొనసాగించాలని టీచర్ల డిమాండ్
- స్పష్టత ఇవ్వని అధికారులు
- హైస్కూల్ ప్లస్ కొనసాగింపుపై సందిగ్ధత

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హైస్కూల్ ప్లస్‌లు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతాయా లేదా అనే సందిగ్ధత నెలకొంది. వీటి కొనసాగింపుపై ఇప్పటికే ఉన్నతాధికారులు పరోక్షంగా పలుమార్లు ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన చర్చలలో స్పష్టత ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగించి వాటి స్థానంలో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కానీ ఉపాధ్యాయులు మాత్రం వాటిని యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాలను కూడా అందజేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 502 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. వీటిని తొలగిస్తామని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో అందులో పనిచేసే సిబ్బంది డైలమాలో పడ్డారు. గత ప్రభుత్వం 2022లో 292 హైస్కూల్ ప్లస్‌లను (మహిళా జూనియర్ కళాశాలలు) ఏర్పాటు చేసి కేవలం బాలికలకు అవకాశం కల్పించారు. వీటికి అదనంగా ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచి మరో 210 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఎన్నికల ముందు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 502 హైస్కూల్ ప్లస్‌లు ఉండగా, మండలానికి రెండు చొప్పున ఒకటి కోఎడ్యుకేషన్, మరొకటి బాలికల జూనియర్ కళాశాలలుగా ఏర్పాటు చేశారు.

మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలను మెర్జ్ చేసి హైస్కూల్ ప్లస్ పేరిట ఇంటర్ పరిమితమైన గ్రూపులతో సిబ్బంది కొరతతో జడ్పీ హైస్కూల్‌లోనే వీటిని నిర్వహిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన 292 హైస్కూల్ ప్లస్‌లలో పూర్తి స్థాయిలో సిబ్బంది, గ్రూపులను ఏర్పాటు చేయకుం డానే మరల 210 ఏర్పాటు చేయడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల ముందు 210 కో ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన గత ప్రభుత్వం అందులో సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీనిపై ఉపాధ్యా యులు అనేక మార్లు అధి కారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపో యింది. దీంతో హైస్కూల్ ప్లస్ లు విమర్శలపాలయ్యాయి. గత ప్రభు త్వం హైస్కూల్ ప్లస్‌ల నిర్వ హణలో తీసుకున్న అనాలోచిత నిర్ణయా ల వల్ల గత రెండేళ్లుగా ఇంట ర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో విద్యార్థులు దారుణం గా ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యం లో కూటమి ప్రభుత్వం పాఠశా లలతో పాటు హైస్కూల్ ప్లస్‌లను ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది.

**హైస్కూల్ ప్లస్ సిబ్బందిలో గుబులు....**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను తొలగిసా రంటూ ప్రచారం జరుగుతుండటంతో వాటిలో పనిచేసే సిబ్బందిలో గుబులు పుడుతోంది. వాస్తవానికి గత ప్రభుత్వం మొదట 292 హై స్కూల్ ప్లస్‌లు (బాలికల జూనియర్ కళాశాలలు) ఏర్పాటు చేసినప్పు డు వారికి పాఠాలను బోధించడానికి పాఠశాల విద్యలోని ఆయా యా జమాన్యాలలో పనిచేసే అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను పీజీటీ లుగా పదోన్నతులు ఇచ్చి నియమించారు. అయితే ఇపుడు ఈ హైస్కూల్ ప్లస్‌లు జూనియర్ కళాశాలలుగా రూపాంతరం చెందిన తరువాత హైస్కూల్ ప్లస్‌లలో పనిచేసే ఉపాధ్యాయులను తిరిగి వెనక్కి... అంటే పూర్వం పనిచేసే పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లుగా పంపుతామని అధికారులు ఉపాధ్యాయ సంఘాల నేతలకు చెబుతు న్నారు. దీంతో హైస్కూల్ ప్లస్ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా రు. హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా ఏర్పాటు చేసిన తదుపరి జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు హెచ్ఎంలకు పీజీటీలుగా పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నారు.

**తలనొప్పిగా మారిన జీవో 302, 223**

ప్రస్తుతం ఉన్న హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా మారిస్తే నిబంధనల ప్రకారం జీవో 302, 223లను అనుసరించి సిబ్బంది నియామక ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఈ నిబంధనల ప్రకారం పాఠశాల విద్యలో పనిచేసే ఉపాధ్యాయులను నియమించే అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ల నియామకానికి 1979 నుంచి ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీవోలు ఇలా ఉన్నాయి.... 1979లో తీసుకువచ్చిన జీవో 939 ప్రకారం జిల్లాపరిషత్, మున్సిపల్ టీచర్లకు 25 శాతం, ప్రభుత్వ టీచర్లకు 25 శాతం పదోన్నతుల కోటాలో భర్తీ చేయాలి. మిగిలిన 50 శాతం మందిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వా రా తీసుకోవాలి. 1993లో తీసుకువచ్చిన 302 జీవో ప్రకారం 50 శా తం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, 40 శాతం జిల్లాపరిషత్, ప్రభుత్వ టీచర్లను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. మిగిలిన 10 శాతం నాన్ టీచింగ్ స్టాఫ్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో గతంలో ఉన్న మున్సిపల్ టీచర్స్ 25 శాతం కోటాను తొలగించారు. ఆ తదుపరి 2008లో తీసుకువచ్చిన 223 జీవో ప్రకారం 90 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, 10 నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో అప్పటి వరకూ జిల్లాపరిషత్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న 40 శాతం కోటాను తొలగించారు. ఇలా జీవో 302లో మున్సిపల్ టీచర్ల కోటాను, జీవో 223లో జిల్లా పరిషత్, ప్రభుత్వ టీచర్ల కోటాను తొలగించారు. ఇపుడు జీవో 223ను తొలగిం చాలని జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తుండతో పాటు మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా 1979లో తీసుకువచ్చిన 939 జీవోను తిరిగి అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

**502 హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి: నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్**

నూతన జాతీయ విద్యా విధానం సిఫారసుల మేరకు ప్రతి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోను ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా 15 నుంచి 18 సంవత్సరాల విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో పెంచేందుకు చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హై స్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని వీటితోపాటు కో ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను కూడా కొనసాగిస్తూ రెగ్యులర్ పదోన్నతులు చేపట్టాలని కోరారు. తద్వారా రాష్ట్రంలోని రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉంటుంద న్నారు. నూతన జాతీయ విద్యా విధానం సిఫారసుల మేరకు 1000 సీబీఎస్ఈ పాఠశాలలు కొనసాగించాలి అన్నారు. ఈ పాఠశాలలు కొన సాగించడం ద్వారా దాదాపు పదివేల మంది స్కూల్ అసిస్టెంట్లకు ప దోన్నతులు పొందే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్లు



- ఈ-లాటరీ ద్వారా కేటాయింపు
- ప్రొవిజనల్ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన సీఆర్డీఏ

**అమరావతి,ఆంధ్రప్రభ:** రాజధాని కోసం భూములిచ్చిన మంగళగిరి, తుళ్లూరు మండలాల్లోని 79 మంది రైతులకు బుధవారం ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 191 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయిం చారు. కృష్ణాయపాలెం, నవులూరు-1,2, నిడమర్రు-1, 2, వెలగపూడి, మందడం-1,2, కురగల్లు-1,2, తుళ్లూరు-1,2 నెక్కల్లు, అనంతవరం చెందిన రైతులకు ప్లాట్లను కేటాయిం చారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ కమిష నర్ కె.కన్నబాబు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించారు. రిటర్న బుల్ ప్లాట్లు పొందిన రైతులు వీలైనంత తొంద రగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఎల్పీఎస్ భూముల్లో అభివృద్ధి పనులు మొదలవుతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యం కాకుండా కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించినట్టు రైతులకు కమిషనర్ తెలిపారు.

**నేడు మరో 167 మందికి ప్లాట్లు**

అమరావతి కోసం భూములిచ్చిన 11 గ్రామాల్లోని 167 మంది రైతులకు ఈనెల 13న గురువారం 364 రిటర్నబుల్ ప్లాట్లను ఈ లాటరీ విధానం ద్వారా కేటాయించనున్నారు. దొండపాడు, పిచ్చుకులపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, శాఖమూరు, వెంకటపాలెం రైతులకు ఉదయం 10 గంటలకు ఈ లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు సీఆర్డీఏ అధికారులు తెలిపారు. ఉద్ధండరాయునిపాలెం, మల్కాపురం, రాయపూడి-1,2, కొండమ రాజుపాలెం, అబ్బరాజుపాలెం గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ లాటరీ ద్వారా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయిం చనున్నారు. ఆయా సమయాల్లో సంబంధిత రైతులు హాజరు కావాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి. భీమారావు, శేషిరెడ్డి, రవీందర్, పి. పద్మావతి, కె. స్వర్ణ మేరీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# హాఫ్ డే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను తొలగించాలి

*తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం*

**అమరావతి, ఆంధ్రప్రభ:** హాఫ్ డే స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహణ ఆలోచన మానుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహణ కోసం 3వ శనివారం ఉదయం 11.45 వరకు పాఠశాల నిర్వహించి తరువాత పాఠశాల మూసి వేసి స్కూల్ కాంప్లెక్స్‌కి ఉపాధ్యాయులు కాంప్లెక్స్ కి మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకోడం చాలా కష్టమన్నారు. ఉపాధ్యాయులు లంచ్ చేసే టైం కూడా లేదని రవాణా సౌకర్యం లేని అనేక స్కూల్స్ ఉన్నాయని అన్నారు.

# గ్రామ, వార్డు కార్యదర్శుల పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

**అమరావతి, ఆంధ్రప్రభ:** గ్రామ, వార్డు కార్యదర్శుల పోస్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 24 వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం ఏపీపీఎస్సీ ప్రకటన విడుదల చేసింది. 24వ తేదీ నుంచి వచ్చే నెల మార్చి 6 వ తేదీ లోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

# 23న గ్రూప్2 పరీక్షలు

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఈ నెల 23 వ తేదీ నుంచి గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ బుధవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. కొద్దిరోజులుగా గ్రూప్ 2 పరీక్షల నిర్వాహణపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై స్పష్టత ఇస్తూ ప్రకటన విడుదల చేశారు. 23 వ తేదీ ఉదయం 10 నుంచి 12:30 వరకూ పేపర్1, మధ్యాహ్నం 3 నుంచి 5:30 వరకు పేపర్ 2 పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# తిరుపతి తొక్కిసలాట ఘటనపై పిల్ కొట్టివేత

**అమరావతి, ఆంధ్రప్రభ:** తిరుమల తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఇప్పటికే ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం జుడీషియల్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో వేరే విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. అదేవిధంగా ఇదే అంశంపై బుధవారం దాఖలైన మరో పిల్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించడంతో పాటు 40 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సిట్టింగ్ లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడంతో పాటు, విచారణకు సంబంధించి 30రోజుల్లో నివేదికను గవర్నర్‌కు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కర్నూలు జిల్లా పాండురంగాపురానికి చెందిన రైతు గుడిబండ ప్రభాకర్‌రెడ్డి హైకోర్టులో గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గత వారం వాదనలు విని తీర్పు వాయిదా వేసిన ధర్మాసనం బుధవారం నిర్ణయాన్ని వెలువరించింది. ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జుడీషియల్ విచారణకు ఆదేశించిందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు వివరించారు. దీంతో ఈ వ్యవహారంలో తదుపరి ఆదేశాలు ఏవీ అవసరం లేదన్న సీజే ధర్మాసనం విచారణ కమిషన్ తన నివేదికను గవర్నర్‌కు మాత్రమే సమర్పించేలా ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించింది. విచారణ గడువును 30 రోజులకే పరిమితం చేయాలన్న అభ్యర్థనను సైతం తోసిపుచ్చింది. విచారణ నివేదికను గవర్నర్‌కు మాత్రమే ఇవ్వాలన్న నిబంధన చట్టంలో లేదని, కమిషన్స్ ఆఫ్ ఎంక్వయిరీ చట్టం కింద కమిషన్ ఏర్పాటు, విచారణ గడువును నిర్ధేశించడం పూర్తిగా ప్రభుత్వ విచక్షణాధికారమని స్పష్టం చేసింది.


## ఎస్ఎస్ఎఫ్ లిమిటెడ్

కార్యాలయం : ఫ్లాట్ నెం.102, ఓపెల్స్ ది ఐకానిక్, డి నెం: 9-29-7/2, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం-530003, ఆ.ప్ర., ఇండియా. సిఐఎన్: ఎల్05001ఎపి1968పిఎల్‌సి094913

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలు

(ఐఎన్ఆర్ లక్షలలో, ఇపిఎస్ మినహా)

| క్ర సం | వివరాలు | ముగిసిన త్రైమాసికం 31-12-2024 (ఆడిట్ చేయనివి) | 31.12.2024తో ముగిసిన కాలం కొరకు సంవత్సరం నుండి తేదీకి సంఖ్యలు (ఆడిట్ చేయనివి) | ముగిసిన త్రైమాసికం 31.12.2023 (ఆడిట్ చేయనివి) |
|---|---|---|---|---|
| 1. | కార్యకలాపాల నుండి ఆదాయం | 1469.78 | 3022.34 | 834.45 |
| 2. | పన్నుకు ముందు కాలానికి నికర లాభం/(నష్టం) (మినహాయింపదగిన మరియు / లేదా అసాధారణ ఐటంలకు తర్వాత#) | 42.29 | 85.88 | 11.97 |
| 3. | పన్నుకు తరువాత కాలానికి లాభం/(నష్టం) (మినహాయింపదగిన మరియు / లేదా అసాధారణ ఐటంలకు తర్వాత) | 18.75 | 44.76 | 8.33 |
| 4. | కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం (కాలానికి (పన్ను తరువాత) లాభం /(నష్టం) కలిగి ఉన్నది) | 13.84 | 40.91 | 9.12 |
| 5. | ఈక్విటీ వాటా మూలధనం | 665.67 | 665.67 | 665.67 |
| 6. | రిజర్వులు (ముందు సంవత్సరం యొక్క ఆస్తి అప్పుల పట్టికలో చూపిన విధంగా రీవాల్యుయేషన్ రిజర్వులు మినహా) | 1,089.43 | 1,089.43 | 1,043.77 |
| 7. | ప్రతి ఈక్విటీ వాటాకు ఆర్జనలు: (ఐఎన్ఆర్10/- చొప్పున) (వార్షికం కానివి) | | | |
| | 1) బేసిక్ | 0.28 | 0.67 | 0.13 |
| | 2) డైల్యూటెడ్ | 0.28 | 0.67 | 0.13 |

సూచనలు: సెబీ (లిస్టింగ్ మరియు ఇతర డిస్‌క్లోజర్ ఆవశ్యకతలు) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్ తో దాఖలు చేయబడిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క సవివర నమూనా యొక్క సారాంశం పైన ఇవ్వబడినది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా మెట్రో పాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఇ) యొక్క వెబ్‌సైట్ https://www.msei.in/ మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.ssflimited.com పై కూడా అందుబాటులో కలవు.

తేది : 12-02-2025
ప్రదేశం : విశాఖపట్నం

పూర్తి ఫలితాల కొరకు స్కాన్ చేయగలరు

ఎస్ఎస్ఎఫ్ లిమిటెడ్ కొరకు
సం/- వి. పద్మనాభం,
మేనేజింగ్ డైరెక్టర్(DIN: 01246827)

## కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్

సిఐఎన్ :ఎల్63040ఎపి1981పిఎల్‌సి003047
నమోదిత కార్యాలయం: కోస్టల్, ఒన్ ప్లాట్ నెం.1 బాలాజీనగర్ 3వ & 4వ అంతస్తు, డోర్ నెం. 8-1-5/4, సిరిపురం, ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్, ఇండియా. ఫోన్ నెం.0891-2567118, ఫ్యాక్స్ : 0891-2567132, వెబ్‌సైట్ : www.coastalcorp.co.in, ఇ-మెయిల్ : cs@coastalcorp.co.in

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలు

(రూపాయలు లక్షలలో)

| క్ర. సం. | వివరములు | కన్సాలిడేటెడ్ ముగిసిన త్రైమాసికం 31-డిసెంబర్-2024 (ఆడిట్ చేయనివి) | కన్సాలిడేటెడ్ ముగిసిన తొమ్మిది నెలలు 31-డిసెంబర్-2024 (ఆడిట్ చేయనివి) | కన్సాలిడేటెడ్ ముగిసిన త్రైమాసికం 31-డిసెంబర్-2023 (ఆడిట్ చేయనివి) |
|---|---|---|---|---|
| 1. | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం (నికరం) | 18,649.88 | 47,781.57 | 10,869.55 |
| 2. | నికర లాభం/(నష్టం) కాలానికి పన్నుకు ముందు | 191.61 | 746.37 | 416.33 |
| 3. | నికర లాభం/(నష్టం) కాలానికి పన్ను తరువాత | 194.97 | 551.34 | 294.22 |
| 4. | చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.10/- చొప్పున | 1,339.54 | 1,339.54 | 1,343.13 |
| 5. | మొత్తం సమగ్ర ఆదాయం కాలానికి (పన్ను తరువాత కాలానికి లాభం మరియు పన్ను తరువాత ఇతర సమగ్ర ఆదాయం కలిగి ఉన్నది) | 189.27 | 579.40 | 284.80 |
| 6. | ప్రతి వాటా ఆర్జనలు (రూ.10/- చొప్పున) | | | |
| | బేసిక్ | 1.46 | 4.12 | 2.23 |
| | డైల్యూటెడ్ | 1.46 | 4.12 | 2.23 |

స్టాండ్ అలోన్ ఆర్థిక ఫలితాల యొక్క కీ నెంబర్లు

| క్రసం. | వివరములు | ముగిసిన త్రైమాసికం 31-డిసెంబర్-2024 (ఆడిట్ చేయనివి) | ముగిసిన తొమ్మిది నెలలు 31-డిసెంబర్-2024 (ఆడిట్ చేయనివి) | ముగిసిన త్రైమాసికం 31-డిసెంబర్-2023 (ఆడిట్ చేయనివి) |
|---|---|---|---|---|
| 1. | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం (నికరం) | 18,155.84 | 46,467.83 | 10,617.14 |
| 2. | లాభం/(నష్టం) పన్నుకు ముందు | 122.81 | 835.95 | 496.41 |
| 3. | నికర లాభం/(నష్టం) పన్ను తరువాత | 123.38 | 640.92 | 371.60 |
| 4. | మొత్తం సమగ్ర ఆదాయం కాలానికి (పన్ను తరువాత కాలానికి లాభం మరియు పన్ను తరువాత ఇతర సమగ్ర ఆదాయం కలిగి ఉన్నది) | 117.69 | 667.65 | 365.61 |

గమనిక: సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ ఆవశ్యకతలు) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో దాఖలు చేయబడిన కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక నమూనా యొక్క సారాంశం పైన ఇవ్వబడినది. స్టాండ్ అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.coastalcorp.co.in పై మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వెబ్‌సైట్లు www.bseindia.com మరియు www.nseindia.com పై కూడా లభించును.

ప్రదేశం: విశాఖపట్నం
తేది : 12 ఫిబ్రవరి, 2025

పూర్తి ఫలితాల కొరకు స్కాన్ చేయండి

డైరెక్టర్ల బోర్డు తరపున మరియు కొరకు
సం/- టి. వల్సరాజ్,
వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్